

# ప్రతిఫలం

## రసరాజు

**ఒకప్పుడు తను కూడ దరిద్రం అనుభవించినవాడే. ఆ దరిద్రంలో తన పెళ్ళాంకూడా తనలాగే బరువు బ్రతుకు బ్రతికింది... చేదుమేసింది. తన అడుగు జాడల్లోనే ఆమెకూడా అడుగులేసింది. అప్పుడే ఆమె...**

"హోటల్ నయాగరా"లో భోంచేసి చలపతి బయటికొచ్చాడు.

మల్లెపువ్వులాంటి వెన్నెల —

అమృతం కురుస్తున్న రాత్రి —

ఇంటికి వెళ్ళాలనిపించలేదు.

ఆ వెన్నెల వర్షంలో తడుస్తూ "మధుమతి సెంటర్" వరకు నడిచాడు.

అక్కడన్నీ పూలదుకాణాలే.

సుగంధ భరితంగా ఉంది ఆ ప్రదేశమంతా.

రెండు సంపెంగలు కొనుక్కొని మరికొంతదూరం నడిచాడు.

బస్టాండ్లో ఆఫీసు వేపు పోయే సిటీబస్సు రెడీగా ఉంది.

కాస్సేపు ఆఫీసులో కాలంగడిపి వద్దామని బస్సెక్కాడు. ఆఫీసులో అడుగు పెట్టేసరికి — నైట్ వాచ్‌మెన్ నారాయుడు, ఎటెండర్ రాజరత్నం "పులీ — మేక" ఆడుకుంటున్నారు.

చలపతి వాళ్ళకేమీ భంగం కలిగించలేదు. వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు. టేబిల్ సొరుగులోంచి 'మాన్యుయల్' తీసి కాస్సేపు అటూఇటూ తిరగేశాడు.

దృష్టి — పుస్తకంమీద లేదు.

అక్షరాలు మసకమసగ్గా కనిపిస్తున్నాయి.

చలపతి భార్య బెనారస్ యూనివర్సిటీలో చదువుతున్న కూతురు దగ్గరికెళ్ళి రెండు నెలలయింది. ఈ రెండునెలల్లోనూ — ఏ ఒక్కరోజు తను సరిగా నిద్రపోలేదు. సరిగా భోంచేయలేదు.

ఏవేవో కోర్కెలు .....

ఆరాటం .....

అటువైపు చూశాడు —

ఆట కసిగా సాగుతోంది.

బుర్ర వేడెక్కిపోయింది చలపతికి.

కుర్చీలోంచి రెండడుగులు ముందుకేశాడు.

ఎదురుగా రెండు పోకచెట్లు —

వెన్నెల్లో మిలమిల్లాడుతూ — గాలికి తలలూపుతూ కనిపించాయి.

"నారాయుడూ... సిగరెట్లు పట్టుకొస్తావా... " చలపతి పిలిచి డబ్బులిచ్చాడు.

నారాయుడు బయటికెళ్ళాడు.

"రాజరత్నం..."

రాజరత్నం ఎదురుగా వచ్చి నిలబడ్డాడు.

"ఇంటికెళ్ళలేదా? ఇక్కడే ఉండిపోయావ్..."

"వెళ్ళేదుసార్.. మా ఆవిడ ఊరుకెళ్ళింది..

చలపతికి గొంతుకలో పచ్చి వెలక్కాయ అడ్డుపడ్డట్లయింది. తెచ్చిపెట్టుకున్న నవ్వుతో "మంచి వాడవోయ్" అన్నాడు. అంతకంటే మరోమాట అతనికి స్ఫురించలేదప్పుడు.

చలపతి మంచితనం గురించి — అతని ప్రవర్తన గురించి — రాజరత్నానికి బాగా తెలుసు. అందుకే చలపతి మాటల్ని మరోలా అర్థం చేసుకోలేకపోయాడు

హోటల్లో కాస్త టిఫిన్ తినేసి వచ్చాను.. సెకండ్‌షోకి పోదామని..."

"నువ్వో పని చేసిపెట్టాలి..." చలపతి వెన్నెల్లో ఎగురుతోన్న పిట్టల్ని చూస్తూ అన్నాడు.

"...చెప్పండి సార్"

"ఎవరికీ ఇది తెలీకూడదు — నీకూ నాకు తప్ప.."

"అలాగే సార్..."

"ఏవీ లేదు..." చలపతి మరేదో చెప్పబోయి నీళ్ళు నమిలాడు.

"చెప్పండిసార్..."

"ఏవీలేదు.. ఓ అమ్మాయి కావాలి.."

రాజరత్నం వెంటనే "పనిపిల్లా సార్" అన్నాడు. రాజరత్నం.

"...పెంచుకోడానికా సార్" అర్థంకాక మళ్ళీ అడిగాడు రాజరత్నం.

"కాదు —ఉంచుకోడానికి..." ఈసారి చలపతి కాస్త కోపంగానే అన్నాడు.

రాజరత్నం నివ్వెరపోతూ ఏవీ తోచనివాడిలా ఆకాశంలోకి చూశాడు. పండువెన్నెల కురిపిస్తోన్న చంద్రుడు — ఆ చంద్రుడిలో మచ్చలు — అతనికి స్పష్టంగా కనిపించసాగాయి.

"ఏం చూడగలవా?..." చలపతి మళ్ళీ అడిగాడు.

రాజరత్నానికి ఏం చెప్పాలో బోధపడలేదు.

"నన్ను పరీక్షించటానికి అలా అంటున్నారు సార్.. మీ మంచితనం నాకు తెలుసు..." చలపతి మంచితనంపై విశ్వాసాన్ని పెంచుకుంటూ అన్నాడు రాజరత్నం.

చలపతి బిక్కచచ్చిపోయాడు. రాజరత్నాన్ని ఎలా ఒప్పించాలో చలపతికి అర్థం కాలేదు. రాజరత్నం ఇటువంటి విషయాల్లో చాలామందికి అప్పుడప్పుడు సాయపడుతుంటాడని తను ఆఫీసుకొచ్చిన తొలి రోజుల్లోనే విన్నాడు. అయితే అతన్ని ఇలా ఉపయోగించుకునే సందర్భం ఎప్పుడో ఒకప్పుడు వచ్చి తీరుతుందని తాను కలలో కూడా ఊహించలేదు..

రాజరత్నం నిలబడే ఉన్నాడు —

అతనికిదంతా అయోమయంగా ఉంది. చలపతి అంటే రాజరత్నానికి అభిమానం — దానికితోడు గౌరవం ఉన్నాయి.

చలపతి ఉంటోన్న వీధి చివర్నే తనూ కాపురముంటున్నాడు. చలపతి ఎన్నోసార్లు తనకు అవసరాలు తీర్చాడు.

"నువ్వు అలా బయటికి వెళ్ళిరావాలి!..."చలపతి మాటల్లో ఆజ్ఞ వ్యక్తమైంది.

రాజరత్నం సందేహంగా చూశాడు.

".. మీ అమ్మగారు ఊరికెళ్ళి రెండు నెలలయింది.. కాస్త మంచి మనిషిని చూడు ఈ రాత్రికి.. అవసరం డబ్బులు కోసం ఆలోచించకు.. ఇదిగో ఈ పదిరూపాయలు నువ్వు తీసుకో...

రాజరత్నం చేతిలో పదిరూపాయల నోటు పరీక్షగా చూసింది.

* * *

రాత్రి పదిగంటల సమయం —

చలపతి — రాజరత్నం చెప్పినట్లే రిక్షా ఎక్కి ఓ యింటిముందు దిగేడు. గుమ్మం దగ్గర నిలబడ్డ ముసలమ్మ — చలపతికి — గదిలోకి దారి చూపించింది.

చలపతి బిడియపడుతూ గదిలోకి అడుగుపెట్టాడు.

మల్లెల పరిమళం...

సుగంధాన్ని వెదజల్లుతూ కాలిపోతున్న అగరొత్తులు...

దూరంగా — కొవ్వొత్తులు వెలుగులో — కొప్పనిండా పూలు తురుముకొని "విందు" చేసే అమ్మాయి.

కోరికలైతే గుర్రాలై ఈడ్చుకొచ్చాయిగానీ, తనకీ అనుభవం బొత్తిగా కొత్తది.

గుండె చిక్కబట్టుకుని ముందుకు నడిచాడు చలపతి.

మూడు పదుల వయస్సుంటుంది ఆమెకు.

"నీపేరు ఊర్వశా..." అడుగుదామనుకున్నాడు. కాని



గొంతు దాటి మాటరాలేదు. ఓ నిమిషం అలా చూస్తూ ఉండిపోయాడు.

ఆమె మెడలో మంగళసూత్రాలు కొవ్వొత్తి వెలుగులో మిసమిసలాడుతూ కనిపించాయి.

ఒకసారి గుండె మూలల్లో ఎక్కడో బాధ సుళ్ళు తిరిగినట్లయింది.

"నీ పేరు.."

"...సుగుణ"

"సంసారం చేసుకొంటున్నావా.."

"ఊఁ..."

"మరిదేం పని?..."

"కుటుంబం గడవక.. ఇదే మొదటిసారిగా తప్పుచేయడం..." దళపతికి ఆ మాటతో బుర్ర తిరిగినంత పనయింది.


అతని కళ్ళకు ఆ మంగళసూత్రాలే కనిపిస్తున్నాయి.

ఒకప్పుడు తనుకూడా దరిద్రం అనుభవించినవాడే.. ఆ దరిద్రంలో తన పెళ్ళాంకూడా తనలాగే బరువు బ్రతుకు బ్రతికింది.. చేదుమేసింది. తన అడుగు జాడల్లోనే ఆమె కూడా అడుగులేసింది. అప్పుడే ఆమె ఈ దరిద్రం బాధపడలేక నీచంగా మరోదారి త్రొక్కుంటే...

దళపతి ఆ భావాన్ని ఏమాత్రం భరించలేకపోయాడు..

అంతే
ఆమెను మరేవీ ప్రశ్నించలేదు.
ఆమె శరీరంపై తన కబంధ హస్తాల ముద్రలు ఎంతమాత్రం పడకూడదు...
ఆమె దరిద్రం తన కామానికి తలొంచకూడదు.
ఆమె శీలాన్ని కామాంధుడిలా కబళించకూడదు.
జేబులో ఏభై రూపాయల కాగితాన్ని తీసి టేబిల్ మీద పెట్టేసి మరోమాట మాట్లాడకుండా వలపతి గదిలోంచి బయటికొచ్చేశాడు.
"ఏమండీ.." ఆమె పిలుస్తోంది.
వలపతి రోడ్డెక్కేసాడు.
సిగరెట్ వెలిగించి — ఒక మంచిపని చేసిన వాడిలా ఒకో అడుగూ వేస్తూ ముందుకు నడుస్తున్నాడు.
తలంతా బరువుగా ఉంది.
"హోటల్ తాజ్" దూరంగా కనిపించింది.
వేడివేడి చాయ్ గొంతుకు పోసుకొన్నాడు.
తాజ్ ప్రక్కనే 'థియేటర్ మూన్' —
మూన్‌లో "కామరాత్రులు" ఆడుతోంది.
టికెట్ తీసికొని బాల్కనీలో కెళ్ళి కూర్చున్నాడు వలపతి.
పిక్చర్ మొదలైంది.
సన్నివేశం వెనుక సన్నివేశం —
ప్రతిదీ అతన్ని ప్రభావితుణ్ణి చేస్తూనే ఉంది.
రక్తం వేడెక్కించే దృశ్యాలు —
ఆరిపోతున్న కోరికల మంటలు — వలపతిలో మళ్ళీ క్రమంగా రగుల్కోవడం మొదలు పెట్టాయి.
అందులో ఒక సన్నివేశం —
ఆమెపై అతడు —
అతనిపై ఆమె —
అలా దొర్లుకుంటూ దొర్లుకుంటూ ఆ వెన్నెల రాత్రిలో — ఆ ఇసుకతిన్నెలపై...
ఆ ఒక్క సన్నివేశం — అతనిలో బలమైన ముద్రవేసింది.
వలపతి కళ్ళు ఇక ఆ దృశ్యాన్ని చూడటం మానేశాయి.
మనసులో ఏదో ప్రకంపనం —
మొదట కేసు నచ్చకపోతే ఆ ప్రక్క సందులోనే మరో కేసుంది. అక్కడికెళ్ళండి.. అదీ మాట్లాడుంచా ను.." అన్న రాజరత్నం మాటలు మరోసారి మనసులోకి తెచ్చుకొన్నాడు వలపతి.
రకరకాల సన్నివేశాలు — రీలు వెంట రీలు....
కైపెక్కిన వాడిలా వలపతి మధ్యలో లేచిపోయాడు.
అతని దృష్టిలో ఇప్పుడు — రాజరత్నం చెప్పిన రెండోకేసు మెదులుతోంది

బయటికొచ్చి రిక్షా ఎక్కాడు. ఆ ఇంటి దగ్గర దిగేడు.
అప్పటికే పన్నెండయింది
"రాజరత్నం ఏమైనా చెప్పాడా ..." అక్కడో మనిషిని అడిగాడు వలపతి.
ఆ మనిషి గ్రహించి "రండి బాబూ.. మీరేనా.." అంటూ ఆ ప్రక్కనే ఉన్న పెంకుటింట్లోకి తీసికెళ్ళింది.
పద్దెనిమిదేళ్ళు కూడా దాటని వయస్సు —
లంగా — వోణీ...
కొంచెం పల్లగా ఉన్నా — కొనతేరిన ముక్కు.. విశాలమైన కళ్ళు.. వివరాలేవీ అడక్కూడదనుకొన్నాడు. కానీ, ఏవో రెండు మాటలైనా మాట్లాడకపోతే సరసం తెలిని మోటుమనిషి అనుకొంటుందేమోనని వలపతి ఉద్దేశం.
"పేరేమిటి?...." మొదటిమాటగా పలకరించాడు వలపతి మంచంమీద కూర్చుంటూ.
"సుశీల..."
"పెళ్ళి చేసుకోలేదా.."
"లేదు.."
"ఏ..."
"తండ్రి పోయాడు... తల్లి రోగంది.."
"ఇదే ఆధారమా..." వివరాలకు వెళ్ళకూడదనుకుంటూనే అడిగాడు.
"ఇన్నటిదాకా మిల్లులో పనిచేసే దాన్ని .. దాంతో ఇద్దరిపొట్ట గడవటం కష్టంగా ఉంది.. ఇలా అయితే తిండికి సరిపడే డబ్బులొస్తాయని ఈ సందులో మనిషి ఈవేళే ఇక్కడికి తీసుకొచ్చింది. ఇంతవరకు ఏ పాపం పు న్నెం తెలీదు..."
"నిజమా?..."
"మా అమ్మమీద ఒట్టు..." ఈ మాట ఆ అమ్మాయి గొంతులోంచి మూగవేదనగా ఉబికి పడ్డట్లయింది.






### భర్త

భర్త గురించి గొప్పగా చెప్తూ శైలజ "మావారిని ఒక పుస్తకంలా చదివేయ గలను." అంది విమలతో.
"అదేమోగాని, ఆ పుస్తకాన్ని మాత్రం నీ లైబ్రరీలోనే వుండేట్లు చూసుకో — చాలు" అంది విమల.
—యం. రామకృష్ణ కిషోర్
(విజయవాడ)

సరిగ్గా అదే వయస్సులో బెనారస్ యూనివర్సిటీలో చదువుతోన్న కూతురు ఒక్కసారిగా మనసులో మెదిలింది.
ఆమెకూ ఇదే వయసు పద్దెనిమిదేళ్ళు కూడా దాటి ఉండవు.
వలపతి మనస్సు బాధగా మూల్గింది.
ఒక కన్నెబతుకు తన కారణంగా బలికావడమా...
తనకు మాత్రం అటువంటి కూతురు లేదూ..
తనేమన్నా రాక్షసుడా..
వలపతిలో మళ్ళీ తిరగబడ్డ మానవత్వం —
ఆ నిమిషంలో వలపతికి రాజరత్నంమీద ఒక్కసారిగా పట్టరాని కోపమొచ్చింది.
'మంచి అమ్మాయిని చూడమంటే ఇదా.. అభమూ శుభమూ తెలియని కొత్తవాళ్ళనా తన దగ్గరికి పంపించడం..." వలపతి బాధపడ్డాడు.
ఇక ఎక్కడికీ వెళ్ళి దాహం తీర్చుకోవాలన్న కాంక్ష అతనిలో లేదు.
జేబులోంచి మూడువందలుతీసి మంచంమీద పెట్టి — బయటికొచ్చి రిక్షా ఎక్కేసాడు మౌనంగా వలపతి.

* * *

గదిలో దీపం వెలుగుతోంది.
వలపతి ఆలోచిస్తూ కూర్చున్నాడు.
తుఫానులో చిక్కుకొని — చివరికి ఒడ్డుచేరిన నావికులా ఉంది అతని పరిస్థితిప్పుడు
సెకండ్ షో అయ్యాక ఇంటికిపోతూ — ఇంకా వెలుగుతోన్న లైటుచూసి — రాజరత్నం గేటుతీసికొని లోపలికొచ్చాడు.
"సార్..."
వలపతి ఉలిక్కిచూశాడు కిటికీలోంచి.
రాజరత్నం —
వెళ్ళి తలుపుతీశాడు.
"ఏమిటి సార్.. ఇంకా నిద్రపోలేదా..."
"లేదు!" వలపతి కాస్త విసురుగామూ, బాధగామూ అన్నాడు.

రాజరత్నం చలపతిలో చూడాలనుకొన్న సంతోషాన్ని చూడలేక పోతున్నాడు.

చలపతి – నుదుటి భాగాన్ని పదేపదే చేతి వేళ్ళతో నొక్కుకొంటున్నాడు.

"తలపోటా సార్.."

చలపతి బదులు పలకలేదు...."

"మరీ ఢీలా పడిపోయారే – కొంపదీసి కేసు బెడిసి కొట్టిందేమిటి సార్..."

"నువ్వు చేసిన పనే బాగాలేదోయ్..."

"అదేమిట్సార్.."

కాస్త మంచి మనిషిని చూడమంటే ఇలాగా నువ్వు చూసేది?"

"ఏమిట్సార్.. ఏమైంది....?"

"ఏముందీ? ముందు నువ్వు చెప్పిన చోటికే వెళ్ళా అది పెళ్ళయిన మనిషి మంగళసూత్రాలు మెళ్ళో కనిపిస్తుంటే నాకేవిటో ఒళ్ళు జలదరించినట్లయింది. పైగా ఇదే మొదటిసారట... కుటుంబం గడవక కొత్తగా ఇలాదారి తొక్కిందట... మనసు పుట్టక డబ్బులిచ్చేసి వచ్చేశాను.."

"పంపేశారు సార్... మరి రెండో మనిషి?"

"అదీ అంతే.. ఆ అమ్మాయికి అసలు పెళ్ళే కాలేదట.. పద్దెనిమిదేళ్లుంటాయేమో... లంగా వోణీతో ఉంది. తల్లి జబ్బు మనిషట.. నిన్నటిదాకా ఏదో మిల్లులో పనిచేసే పిల్లను తీసికొచ్చి ఈవేళ ఈ రొంపిలో దింపిందట ఆ సందులో ఉన్న మనిషి. వెళ్ళిన నేరానికి ఆ పిల్లకు కూడా డబ్బులిచ్చేసి ఇదిగో ఇలా పిచ్చోడిలా వచ్చి కూర్చున్నాను. నువ్వు చేసిన ఘనకార్యానికి..."

రాజరత్నంకి ఏం చెప్పాలో తెలిసింది కాదు. సన్నగా నవ్వాడు.

రాజరత్నం అలా ఎందుకు నవ్వాడో చలపతికి అర్థంకాలేదు.

కొన్ని క్షణాలు గడిచాక — ఉండబట్టలేక "ఎందుకు నవ్వావు?"అని అడిగాడు చలపతి.

రాజరత్నం మళ్ళీ నవ్వాడు.

ఈ రెండోసారి నవ్వుతో — చలపతికి పిచ్చెక్కినంత పనయింది.

.... చూడండి సార్! ఈ ఫీల్డ్‌లో మీకు బొత్తిగా అనుభవం లేదు. మీకిదే మొదటిసారి కావచ్చుగాని, వాళ్ళకు మాత్రంకాదు. మీరనుకొంటున్నట్లు మొదటిది సంసారీ కాదు, రెండోది కన్నెపిల్ల అంతకంటే కాదు.."

"మరి.." చలపతి ఆశ్చర్యంగా చూశాడు.

"అదంతా ఓ టెక్నిక్ సార్.. ఫేమిలీ లేడీ అంటే కొంతమంది పడిచస్తారనుకొండి.. అందుకని మంగళసూత్రాలు తగిలించుకుని మీ దగ్గర అలా నటించింది. దానికి పెళ్ళీ లేదు పెటాకులూ లేవు.. ఇదే దాని వ్యాపారం.. క్లాసు మనిషి.. బజారు సరుకు మాత్రం కాదు సార్.."

"నటించిందా.. మరి రెండోది.." ఆశ్చర్యంగా అడిగాడు చలపతి..

"అదీ అంతే సార్.. మొదటిది ఫేమిలీ లేడీగా మంగళసూత్రాలు తగిలించుకుని క్లాసుగా వ్యాపారం చేస్తుంటే ఇది ప్రక్క ఊరునించి అప్పుడప్పుడు సినిమాలకని వచ్చి ఉన్న సూత్రాల్ని తీసేసి కన్నెపిల్లగా గుట్టుగా వ్యభిచారం సాగిస్తోంది సార్.. కొంతమంది జనానికి మెళ్ళో మంగళసూత్రం పడని కన్నెపిల్లలంటే చచ్చేటంత మోజనుకోండి. అందుకోసమే పేచీపూచీ లేని బంగారంలాంటి ఈ రెండు కేసుల్ని పు రమాయించాను మీ ఆరోగ్యం దెబ్బదినకూడదని. ఎంత అమాయకులు సార్ మీరు.. ఇలా తిరిగొచ్చిన మనిషిని జీవితంలో మిమ్మల్నే చూశాను సార్..." రాజరత్నం ఇలా చెప్పకుంటూ పోతున్నాడు.

ఇంతలో ఏదో జీప్ గుమ్మం ఎదురుగా వచ్చి ఆగింది.

అందులోంచి పోలీసులు, ఇద్దరాడాళ్ళు కిందికి దిగారు.

చలపతికి ఆ దృశ్యం కనపడగానే – శరీరంలో వణుకు పుట్టుకొచ్చింది.

పోలీసులు విషయం చెప్పి – ఇద్దర్నీ చలపతికి అప్పగించి జీప్‌లో మళ్ళీ వెనక్కి వెళ్ళిపోయారు.

తన కూతురూ, పెళ్ళాం బెనారస్ నుండి ఇంటికి వస్తూ గమ్యం చేరటానికి పదిహేను కిలోమీటర్లు దూరం ఉందనగా — బస్సు దోపిడీతో పాటు మానభంగాలవంటి అకృత్యాలు జరిగాయని వాటినుండి ఎలాగో తప్పించుకొని ఆ ఇద్దరు సురక్షితంగా ఇంటికి చేరగలిగారన్న విషయం తెలీగానే — చలపతి గుండె వేగంగా కొట్టుకోసాగింది.

ఏమైనా ఆ రాత్రి – సుగుణ, సుశీల ఎటువంటి వాళ్ళయినా —వాళ్ళపట్ల తాను మానవతా దృష్టితో వ్యవహరించినందుకు – ఇది "ప్రతిఫలం" అని తన మనస్సు ఆ క్షణంలో ప్రబోధించింది.

